

బంగారు రథం

అహో.. స్వర్ణరథం

- ప్రశాంతి నిలయంలో ఘనంగా ఆయుధ పూజ
- సత్యసాయి స్వర్ణ రథం, వాహనాలకు ప్రత్యేక అలంకరణ

పుట్టపర్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా వినియోగించిన స్వర్ణ రథం బంగారు కాంతులతో మిరుమిట్లు గొలిపింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆయుధ పూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి ఉపయోగించిన కార్లు, బంగారు రథానికి ప్రత్యేక అలంకరణ చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ బంగారు రథం, కార్లకు పూజలు చేశారు. వేలాదిమంది భక్తులు బంగారు రథాన్ని దర్శించుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్‌లో విద్యార్థులు సంగీత కచేరి నిర్వహించారు.



బంగారు రథానికి పూజలు చేస్తున్న ఆర్‌జే రత్నాకర్

కొనసాగిన యజ్ఞం

విశ్వశాంతి కోసం చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం ఐదోరోజు కూడా కొనసాగింది. పూర్ణచంద్రహాల్‌లో వేదపండితులు యజ్ఞాన్ని కొనసాగించారు. వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ మోహన్, నాగానందం, సేవాసంస్థల ప్రతినిధులు నిమీష్‌పాండే, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మోహినీ అలంకారంలో శ్రీవారు

కదిరి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి మోహినీ అలంకారంలో మురిపించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు మంగళవారం మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే స్వామివారికి నిత్య కైంకర్యాలు చేశారు. శ్రీవారికి మోహినీ అలంకారం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు.



మోహినీ అలంకారంలో దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి సవిత
- రూ.3 కోట్లతో బీటీ రోడ్డుకు భూమిపూజ



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. మండలంలోని బుసయ్యగారిపల్లి నుంచి పొప్పపల్లి తండావరకు రూ.3కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంత్రి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి పోయిందన్నారు. ఏడాదిన్నరలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పల్లె పండుగలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక రోడ్లను నిర్మించామన్నారు. డీఎస్సీ ద్వారా వేల మందికి టీచర్ ఉద్యోగాలు కల్పించామన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామన్నారు. ప్రస్తుతం నాగినాయనిచెరువు గ్రామం నుంచి బుసయ్యగారిపల్లి మీదుగా పది గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. 6కి.మీ. రెన్యూవల్, 3కి.మీ. కొత్తరోడ్డును నిర్మించి సోమందేపల్లి, గోరంట్ల మండలాల ప్రజలకు రాకపోకలు కొనసాగించడానికి అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 15ఏళ్ల నిరీక్షణ తరువాత ప్రజల కలను, ఎన్నికల వేళ ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళలతో ముచ్చటించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరాతీశారు. గ్రామస్థుల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. నాగినాయనిచెరువులో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరాముడు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, నేతలు నీరుగంటి చంద్ర, కన్వీనర్ వెంకటేశులు, మాజీ సర్పంచ్ అశ్వత్థప్ప, సిద్దలింగప్ప, సూరి, ఆకుల రమణ పాల్గొన్నారు.

కొత్త టీచర్లకు 3 నుంచి శిక్షణ

- వారానికే కుదింపు..
- ఆ తర్వాతే కౌన్సెలింగ్
- హాజరైనోళ్లకే ప్లేస్‌మెంట్ ఆర్డర్లు
- కమిషనర్ ఆదేశాలు
- ఏర్పాట్లలో సమగ్రశిక్ష అధికారులు (4లో..)

(4లో..)





మొక్క నాటి, నీరు పోస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

అమ్మకు కృతజ్ఞతగా మొక్క నాటాలి

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమ్మకు కృతజ్ఞతగా ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఏక్ పేడ్.. మా కె నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలో మంత్రి మొక్కలు నాటారు. మంత్రి మాట్లాడుతూ... చెట్లు నాటడం మాత్రమే కాకుండా, వాటిని సంరక్షించాల న్నారు. పచ్చదనం పెంపుతో వాతావరణ మార్పులను ఎదుర్కొనవచ్చన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవానంద్, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్సన్ పాల్గొన్నారు.

కాంట్రావర్సీటీ..!

ఎస్కేయూలో భారీగా నిధుల దుర్వినియోగం

యథేచ్ఛగా ఖర్చు చేసిన పాలకవర్గ సభ్యుడు

- అక్రమాలపై కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు
- అసెంబ్లీలో ప్రస్తావించిన జిల్లా ప్రజాప్రతినిధులు
- విచారణ జరిపిస్తామన్న విద్యా శాఖ మంత్రి లోకేశ్
- వైసీపీ హయాంలోని అక్రమార్కుల్లో మొదలైన అలజడి


శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం


ఎస్కేయూలో నిర్మాణ దశలో ఉన్న పరీక్షల భవనం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించే అవకాశాలు ఉన్నాయన్న సమాచారంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. వైసీపీ ప్రభుత్వంలో వర్సిటీ పాలక వర్గం పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు సమాచారం. అప్పటి పాలకవర్గంలోని ప్రధాన సభ్యుడు వర్సిటీ నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేసినట్లు తెలిసింది. వర్సిటీలో నిధుల దుర్వినియోగం, అక్రమ ప్రమోషన్లు, ఇతరత్ర వాటిపై పెద్ద ఎత్తున కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. కొన్నిరోజుల కిందట పలువురు ఎమ్మెల్సీలు ఆరా తీసి, సమాచారం ఇవ్వాలని వర్సిటీ అధికారులను కోరినట్లు సమాచారం. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు వర్సిటీ ప్రస్తావించారు. వర్సిటీలో జరిగిన అక్రమాలు, నిధుల దుర్వినియోగం తమ దృష్టికి వచ్చిందని, వాటిపై విచారణ చేపడతామని విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్ అసెంబ్లీలో పేర్కొన్నారు. విచారణకు ప్రత్యేక కమిటీని నియమించి వందరోజుల్లోనే నిగ్గుతేలు స్తామన్నారు. ఈ నేపథ్యంలో ఏక్షణంలోనైనా విచారణ జరిగే అవకాశాలు ఉన్నట్లు వర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో అప్పటి పాలక వర్గ సభ్యుడి కనుసన్నల్లో తమపరిధికి మించి వ్యవహరించిన కొంత మంది అధికారులు, ఉద్యోగుల్లో అలజడి రేగినట్లు చర్చ నడుస్తోంది.

విచ్చలవిడిగా వర్సిటీ నిధుల ఖర్చు

వైసీపీ పాలనలో వర్సిటీకి సంబంధించిన ఖాతాల్లోని నిధులను ఇష్టారాజ్యంగా పాలక వర్గ సభ్యులు వినియోగించినట్లు సమాచారం. కమీషన్లు ఇతరత్ర వాటి కోసం పాలకవర్గ సభ్యుడు విచ్చలవిడిగా వర్సిటీ నిధులను వాడేసినట్లు తెలిసింది. దాదాపు రూ.30కోట్లకుపైగా ఇలా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో పరీక్షల విభాగం భవనానికి రూ.12కోట్లు, ఇండోర్ స్టేడియానికి రూ.4.5కోట్లు, క్వార్టర్స్ ప్రహరీకి రూ.2కోట్లు, ఇంజనీరింగ్ కళాశాల భవనం నిర్మాణానికి రూ.3కోట్లు, నర్మద హాస్టల్‌లో రెండో అంతస్తు నిర్మాణానికి 2.38కోట్లు, ఇతరత్ర నిర్మాణాలంటూ మిగిలిన సొమ్ము కేటాయించినట్లు సమాచారం. ఇందులో ఇండోర్, పరీక్షల విభాగం మినహా మిగిలిన అన్నింటికి సంబంధించిన బిల్లుల చెల్లింపులు జరిగిపోయాయి. ఆ పాలకవర్గ సభ్యుడి పాలన మొత్తం నియంత సాగిందంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రమోషన్లు, సస్పెన్షన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. వర్సిటీలో జరిగిన అక్రమాల గురించి ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రస్తావించారు. స్పందించిన మంత్రి నారా లోకేశ్ విచారణ జరిపిస్తామని ప్రకటించారు. దీంతో అప్పట్లో అక్రమాల్లో తలో చేయివేసి సభ్యుడితో కలిసి కొంత పాపాన్ని పంచుకున్న ఉద్యోగ వర్గాల్లో ఆందోళన మొదలైంది.

ఉత్తర్వులు రాలేదు



విచారణ కమిటీ నియమించినట్లయితే ప్రభుత్వం నుంచి మాకు ఉత్తర్వులు వస్తాయి. వర్సిటీలో విచారణ జరుపుతామని ఇంతవరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. విచారణ కమిటీ నియమించినట్లు కూడా మా దృష్టికి రాలేదు.

-రమేష్‌బాబు, రిజిస్ట్రార్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

ఎన్నో అక్రమాలు

గత ప్రభుత్వ పాలనలో విశ్వవిద్యాలయం విద్యా ప్రమాణాలను దిగజార్చుతూ, అర్హతలేని వ్యక్తులకు ప్రమోషన్లు ఇచ్చారు. నిధుల దుర్వినియోగం, ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు ఎన్నో జరిగాయి. కొవిడ్ సమయంలో హాజరుకాలేదని 700మంది చివరి సంవత్సరం పీజీ విద్యార్థులను పరీక్షలు రాయకుండా అడ్డుకున్నారు. పదుల సంఖ్యలో ఉద్యోగులను అక్రమంగా సస్పెండ్ చేశారు. వీటిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఓ కమిటీని ఏర్పాటు చేసి, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నాం. ఆమేరకు పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలి.



-వేమన, జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఏఐఎస్ఎఫ్

అవగాహన లేకే..!

- జనంలోకి వెళ్లని జనరిక్ మందులు
- అపోహలు వద్దంటున్న డీఐ కేశవరెడ్డి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు మందులు అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రారంభించిన ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన(పీఎంబీజేపీ) పూర్తిస్థాయిలో ప్రజల్లోకి వెళ్లడం లేదు. జనరిక్ మందుల వినియోగంపై ప్రజలకు అవగాహన లేకపోవడం, వైద్యులు ప్రిస్క్రిప్షన్‌లో రాయకపోవడమే దీనికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. జనరిక్ మందులు పనిచేస్తాయా? లేదా అన్న సందేహంతో రోగులు ఇటువైపు చూడటం లేదని పలువురు చెబుతున్నారు. అయితే జనరిక్ ఔషధ వినియోగంపై ఎలాంటి అనుమానాలు, అపోహలు వద్దని ఔషధ తనిఖీ అధికారి(డీఐ) పి.కేశవరెడ్డి చెబుతున్నారు.





జనరిక్ ఔషధ దుకాణం, ఔషధ తనిఖీ అధికారి(డీఐ) పి.కేశవరెడ్డి

ప్ర: బ్రాండెడ్‌కు, జనరిక్‌కు మధ్య తేడా ఏంటి..?

జ: బ్రాండెడ్, జనరిక్ మందుల తయారీలో ఎలాంటి తేడాలుండవు. ప్రమాణాలకు లోబడే రెండు రకాల మందులు తయారు చేస్తారు. బ్రాండెడ్ కంపెనీలు వాటి మందులను అమ్ముకోవడానికి ఏరియా, జోనల్, రీజనల్ మేనేజర్లను ఏర్పాటు చేసుకుంటాయి. డాక్టర్ల వద్దకు వెళ్లి వాటి ఉపయోగాలను వివరించడం వంటి మార్కెటింగ్ ఖర్చులు పెడతాయి. జనరిక్‌లో తయారైన ఔషధాలు సరాసరి సీఅండ్ఎఫ్, సూపర్ స్టాకిస్ట్ నుంచి రీటైల్ వ్యవస్థకు వచ్చేస్తాయి. ఈ క్రమంలో ఎలాంటి ప్రమోషన్ ప్రచార కార్యక్రమాలుండవు.

ప్ర: నాణ్యతా ప్రమాణాలు...?

జ: జనరిక్ మందులను ప్రభుత్వంచే లైసెన్సు పొందిన తయారీదారులు ఉత్పత్తి చేస్తారు. జనరిక్ మందుల ఉత్పత్తిలో మంచి ఉత్పాదక పద్ధతులు(జీఎంపీ), ప్రమాణ పరీక్ష పద్ధతుల(జీఎల్‌పీ)ను పాటించే విషయంలో నిరంతర తనిఖీలు చేస్తారు. నాణ్యతమీద ఎలాంటి అనుమానాలు, అపోహలు అవసరంలేదు. సాధారణ పారాసిటమాల్ మాత్ర నుంచి క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు అవసరమైన వరకు అన్నీ కూడా ప్రభావంతంగా పని చేస్తాయి. రూ.3వేల విలువైన బ్రాండెడ్ మందులు రూ.500లోపే జనరిక్ మందులకు ఖర్చు అవుతుంది.


సరసమైన ధరలకే అందుబాటులో ఉన్న అన్నిరకాల మందులు

ప్ర: జనరిక్ లక్ష్యమేంటి...?

జ: తక్కువ ధరలకు నాణ్యమైన ఔషధాలు, శస్త్రచికిత్స వస్తువులను అందించడం ద్వారా ప్రతి పౌరుడి ఆరోగ్య సంరక్షణ బడ్జెట్‌ను తగ్గించడం. జన ఔషధి కేంద్రాలను ప్రారంభించడం ద్వారా ఉపాధిని సృష్టించడం ప్రభుత్వ లక్ష్యం. జనరిక్ మందులను ఎమ్మార్పీకంటే 30నుంచి 80శాతం వరకు తగ్గింపుతో పొందవచ్చు. 2వేల రకాలకుపైగా మందులు, 300 రకాల శస్త్ర చికిత్స వస్తువులు జనరిక్ దుకాణాల్లో అందుబాటులో ఉంటాయి.

ప్ర: లక్ష్యం నెరవేరుతోందా..?

జ: వ్యాధి నయంచేసే ఖర్చులో ఔషధాల కొనుగోలు ఖర్చులే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ ఖర్చును తగ్గించుకునే అవకాశమున్నా అవగాహన లేక డబ్బులు అధికంగా ఖర్చు చేస్తున్నారు. అనేక సందేహాలతో బ్రాండెడ్ కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు. వీటన్నిటి కారణంగా చౌకధరలకే ఔషధాలందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అటంకంగా మారింది.

ప్ర: కారణాలేంటి...?

జ: కొన్ని ఔషధ పరిశ్రమలు జనరిక్ మందులను తక్కువ ధరలకే సరఫరా చేస్తున్నా ప్రజల దృష్టిని ఆకర్షించడంలేదు. ఈ ఔషధాల్ని వైద్యులు సిఫార్సు చేయకపోవడం, సమర్థవంతంగా పనిచేస్తాయన్న నమ్మకం ప్రజల్లో లేకపోవడమే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అనేక మెడికల్ షాపుల్లో జనరిక్ మందులు అందుబాటులోలేని పరిస్థితులు కూడా వినియోగానికి అడ్డంకిగా మారాయి.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు జీతాలివ్వండి

అనంతపురంవిద్య, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పండుగ పూట కూడా జీతాలు ఇవ్వకపోతే ఎలా అని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ చైర్మన్ విజయ్ మంగళవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. సమగ్రశిక్షలో కేజీబీవీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్‌కోఆర్డినేటర్లు, సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఐఈఆర్టీలు, సైట్ ఇంజినీర్లు ఇలా దాదాపు మూడు వేల మంది దాకా ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రెండు నెలలుగా జీతాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమ్మెలోకి పీహెచ్‌సీ డాక్టర్లు

- డిమాండ్ల సాధన కోసం మూడు వరకు విధులకు దూరం
- వైద్యసేవలకు అంతరాయం లేకుండా ప్రభుత్వం ఏర్పాట్లు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) డాక్టర్లు మంగళ వారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఈమేరకు ఏపీ ప్రాథమిక వైద్యకేంద్రాల డాక్టర్ల అసోసియేషన్(ఏపీపీహెచ్‌సీడీఏ) నోటీసులు జారీ చేసింది. అక్టోబరు 3 వరకు విధులకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. మండల స్థాయిలోని పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్లు 2005లో ఉద్యోగంలో చేరినా నేటికీ అదే క్యాడర్‌లో పని చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు పీహెచ్‌సీ డాక్టర్‌గా ఎనిమిదేళ్లు పనిచేసిన వారికి డిప్యూటీ సివిల్ సర్జన్‌గాను, మరో ఎనిమిదేళ్లు ఉద్యోగం చేసిన డాక్టర్లకు సివిల్ సర్జన్‌గాను ఉద్యోగోన్నతలు కల్పించాలి. స్టేట్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కు దశాబ్దాలుగా సమస్యలు చెబుతున్నా పట్టించుకో వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

110మంది డాక్టర్లు

జిల్లా వ్యాప్తంగా 110మంది డాక్టర్లు పీహెచ్‌సీల్లో శాశ్వత విధానంలో పనిచేస్తున్నారు. వీరితోపాటు మరో 60 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. రెగ్యులర్ డాక్టర్లకు నిబంధనల మేరకు ప్రమోషన్లు కల్పించాలి. అయితే ప్రమోషన్లు కల్పించేందుకు ఖాళీలు లేవని ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఈక్రమంలో పలువురు వైద్యులు ప్రమోషన్ లేకుండానే రిటైర్ అవుతున్నారు. మరోవైపు పీజీ కోటాలో వైద్యవిద్యను అభ్యసించేందుకు రూ.20లక్షల బాండును రాయించుకుంటున్నారు. బాండుతోపాటు డిగ్రీ సర్టిఫికెట్లను ప్రభుత్వం వద్ద ఉంచుకుంటున్నారు. పీజీ పూర్తి చేసిన తరువాత విధుల్లోచేరి ఉద్యోగం చేస్తున్నా బాండు మొత్తాన్ని రూ.60లక్షలకు పెంచారని పీహెచ్‌సీ వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమోషన్లు ఇవ్వాలి



ప్రమోషన్ ఇవ్వాలంటే ఖాళీలు ఉండాలని చెబుతున్నారు. డాక్టర్లకు సరిపడా డిప్యూటి సివిల్ సర్జన్, సివిల్ సర్జన్ పోస్టులు లేవు. అందుకే మా స్థానంలోనే టైంబౌండ్ ప్రమోషన్ ఇవ్వాలి. 2005నుంచి ఇప్పటివరకు ప్రమోషన్లు లేకుండానే అనేకమంది పనిచేస్తున్నారు. ఎఫ్‌డీపీ డాక్టర్లకు పారితోషికం ఇవ్వడంలేదు. పీజీ సీట్లకోటాను పెంచడంలేదు. ఇలా అనేక సమస్యలను పరిష్కరించాలని సమ్మెలోకి వెళ్లాం.

-డాక్టర్ నారాయణస్వామి, ఏపీజీడీఏ జిల్లా అధ్యక్షుడు

యథాతథంగా సేవలు: ఈబీ దేవి, డీఎంహెచ్‌ఓ



పీహెచ్‌సీల్లో వైద్యసేవలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నాం. రోజువారిగానే ప్రజలు వారి పరిధిలోని పీహెచ్‌సీలకు వెళ్లి వైద్యసేవలు పొందవచ్చు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్ఎస్ పరిధిలోని 28, ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలలోని 26మంది మొత్తం 54మంది డాక్టర్లను సంబంధిత పీహెచ్‌సీల్లో నియమించాం. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్లతోపాటు పారామెడికల్ స్టాఫ్ విధుల్లో ఉంటారు. 104, 108 వాహనాల సిబ్బందిని అప్రమత్తంచేసి అందుబాటులో ఉండాలని సూచించాం. సమస్యలు ఎదురైతే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రం 08554-235603 నెంబర్‌కు ఫోన్‌చేయాలని కోరాం.

డాక్టర్లు తక్షణమే విధుల్లోకి రావాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిబంధన మేరకు ప్రభుత్వ వైద్యులు సమ్మె చేయడం కుదరదని, తక్షణమే విధులకు హాజరుకావాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులను ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పని చేస్తున్న ప్రభుత్వ వైద్యులు మంగళవారం నుంచి సమ్మె చేస్తున్న నేపథ్యంలో వైద్య సేవలకు ఆటకం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో అనంతపురం వైద్య కళాశాల నుంచి వచ్చిన 20 మంది వైద్యాధికారులను పీహెచ్‌సీలో ఓపీ సేవలకు వినియోగిస్తున్నట్లు ఆమె తెలిపారు. పీహెచ్‌సీల డాక్టర్లు విధులకు హాజరకానిచో క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను కలెక్టర్ శ్యాంప్రసాద్ మంగళవారం పరిశీలించారు. రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కమ్మకుల సంఘాల బలోపేతానికి కృషి

- సామాజికవర్గంలోని పేదలకు చేయూతనిద్దాం
- ఎవరికి ఇబ్బంది వచ్చినా.. అండగా ఉందాం
- ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావ్


అనంతపురం అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కమ్మ కుల సంఘాల బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావ్ పిలుపునిచ్చారు. నగరంలోని రాంనగర్ కమ్మభవన్‌లో కమ్మకుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురకొండ నాగన్న అధ్యక్షతన ఉమ్మడి అనంత జిల్లా కమ్మకుల సంఘాల పాలకవర్గ సభ్యుల ప్రాంతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొడాలి వెంకటసుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్మ కుల సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. కమ్మ సామాజిక వర్గాల వారికి ఏ ఇబ్బంది వచ్చినా ఒక ర్యాపిడ్ యాక్షన్ బృందం తరహాలో అందరం కలిసి అండగా నిలబడాలన్నారు. స్తబ్దతగా ఉన్న కమ్మ సంఘాలను యాక్టివేట్ చేయాలన్నారు. వైసీపీ పాలనలో ప్రస్తుత సీఎం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగానే కాక విదేశాల్లో సైతం నిరసన కార్యక్రమాలు నిర్వహించి, మన సత్తా ప్రపంచానికి చూపించామన్నారు. అమరావతి రైతుల ఉద్యమానికి పూర్తి స్థాయిలో మద్దతు ఇచ్చామన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పుని ఖండిస్తూ ఉద్యమించామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారిని అన్ని రకాలుగా అభివృద్ధి చెందేలా చేయాల్సిన అవసం ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావ్

పేద పిల్లలకు చేయూత

కమ్మ సామాజిక వర్గంలో పేద కుటుంబాల్లోని పిల్లలకు హాస్టల్ వసతి కల్పించి, కళాశాలల్లో చదువుకునేలా చొరవ చూపాలన్నారు. చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న వారికి మన పెద్దలకు చెందిన సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డిగ్రీలు పూర్తి చేసి ఖాళీగా ఉన్న వారికి కెరియర్ గైడెన్స్ ప్రాజెక్టు ద్వారా సాఫ్ట్ స్కిల్స్ నేర్పించి, ఉద్యోగాలు పొందేలా సహకరించాలని సూచించారు. కార్పొరేట్ ఆస్పత్రుల సహకారంతో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి, పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడి, సామాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఏపీ కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశాల్లో అనేక సమావేశాలు నిర్వహించామన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని సంఘాలతో కలిపి విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అనంతరం కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా నియమితులైన బండారు మనోహర్‌నాయుడు, గరికిపాటి సుదర్శన్‌నాయుడును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు బోసుబాబు, ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, కార్యదర్శులు రమేష్, వెంకటరమణ, సురేష్‌నాయుడు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, అఖిల భారత కమ్మ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగాంజనేయులు, కమ్మకుల సంఘం సీనియర్ సభ్యుడు సరిపూటి సూర్యనారాయణ, పెనుకొండ మార్కెట్‌యార్డు అధ్యక్షుడు రామకృష్ణ, తాడిపత్రి సంఘం సభ్యులు బాబు నాయుడు, హిందూపురం సంఘం గౌరవాధ్యక్షుడు నెట్టప్ప, గుంతకల్లు సంఘం అధ్యక్షుడు రామమూర్తి, పామిడి అధ్యక్షుడు బండారు రామాంజనేయులు, పుట్టపర్తి అధ్యక్షుడు కడియాల జయప్ప, ఉరవకొండ అధ్యక్షుడు దగ్గుపాటి శ్రీరామ్, గుత్తి సంఘం అధ్యక్షుడు సురేంద్రలతోపాటు ఉమ్మడి జిల్లా నుంచి అన్ని నియోజకవర్గాల నుంచి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు బండారు మనోహర్‌నాయుడు, గరికిపాటి సుదర్శన్‌నాయుడును సన్మానిస్తున్న నాయకులు

ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలి

- పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్
- డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముందు నిరసన

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమకు ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలంటూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల వైద్యులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర మాట్లాడుతూ.. క్లిష్ట సమయాల్లో ప్రజలకు నిరంతర వైద్యసేవలు అందిస్తున్నా.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించడంలేదన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న వైద్యులకు ఇన్‌సర్వీస్ కోటాను పునరుద్ధరించాలనీ, టైంబౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలనీ, నేషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలనీ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం మంజూరు చేయాలనీ, గిరిజన భత్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకుడు శివరామకృష్ణ మద్దతు పలికారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.


సమ్మె చేస్తున్న వైద్యులు

కొత్త టీచర్లకు 3 నుంచి శిక్షణ

- వారానికే కుదింపు.. ఆ తర్వాతే కౌన్సెలింగ్
- హాజరైనోళ్లకే ప్లేస్‌మెంట్ ఆర్డర్లు
- కమిషనర్ ఆదేశాలు
- ఏర్పాట్లలో సమగ్రశిక్ష అధికారులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ద్వారా ఎంపికైన కొత్త టీచర్లకు ఈనెల 3వ తేదీ నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. నియామక పత్రాలు అందజేసే సమయంలోనే అక్టోబరు 3నుంచి 13వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని విద్యాశాఖ కమిషనర్ షెడ్యూల్ ప్రకటించిన విషయం విదితమే. ముందే కౌన్సెలింగ్ నిర్వహించి, ప్లేస్‌మెంట్స్ ఇచ్చి 4 నుంచి 13 వరకు శిక్షణ ఉంటుందని మళ్లీ చర్చ సాగింది. దీనిపై కమిషనర్ విజయరామరాజు తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈనెల 3 నుంచి 10వతేదీ వరకు శిక్షణ ఉంటుందనీ, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈలెక్కన కొత్త టీచర్లకు వారంపాటే శిక్షణ ఉంటుందని స్పష్టమైంది. శిక్షణకు హాజరయ్యే కొత్త టీచర్లు డ్రస్‌కోడ్ తప్పనిసరిగా పాటించి, పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 11, 12 తేదీల్లో పాఠశాలలో ప్లేస్‌మెంట్లు కేటాయించడానికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 13వ తేదీన కొత్త టీచర్లు కేటాయించిన పాఠశాలల్లో జాయిన్ కానున్నారు. శిక్షణకు హాజరైన టీచర్లకే కౌన్సెలింగ్‌లో ప్లేస్‌మెంట్లు ఇస్తామని కమిషనర్ మెలిక పెట్టినట్లు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. గైర్హాజరైన వారికి రాష్ట్రస్థాయిలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. అక్కడ హాజరైన తర్వాతే ప్లేస్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొత్త టీచర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

సమగ్రశిక్ష అధికారుల తర్జనభర్జన

కొత్త టీచర్లకు శిక్షణ తరగతుల ఏర్పాట్లలో సమగ్రశిక్ష శాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శిక్షణ నిర్వహణ బాధ్యతలను సమగ్రశిక్షకు అప్పగించారు. జిల్లాకు చెందిన 755 మంది టీచర్లతోపాటు కర్నూలు నుంచి 800 మంది శిక్షణకు హాజరవుతున్నారు. అందుకు రెసిడెన్షియల్ స్థాయిలో వసతులు ఉన్న కళాశాలలు, శిక్షణ కేంద్రాలను డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ పరిశీలిస్తున్నారు. దీనిపై బుధవారానికి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని ఏపీసీ తెలిపారు.

ఇద్దరు నేతలకు పదవులు


బెస్త శ్రీనివాసులు


బెస్త మనోహర్


పుట్టపర్తి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల భర్తీలో జిల్లాకి చెందిన ఇద్దరు కూటమి నాయకులకు అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా హిందూపురం నుంచి బెస్త మనోహర్ (బీజేపీ), ధర్మవరానికి చెందిన బెస్త శ్రీనివాసులు (జనసేన)ను నియమించారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

ఫుడ్ సేఫ్టీ సలహా మండలిలో చోటు


సురేష్ కుమార్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ఫుడ్ సేఫ్టీ సలహామండలి సభ్యుడిగా పుట్టపర్తికి చెందిన సురేష్‌కుమార్, కదిరి వాసి రామిరెడ్డిని నియమించారు. వారికి మంగళవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర నియామక పత్రాలు అందజేశారు. సలహామండలికి చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు.

విధుల్లోకి సెక్టోరల్స్..


ఏపీసీ శైలజతో నూతన సెక్టోరల్స్

అనంతపురంవిద్య, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష నూతన సెక్టోరల్స్ విధుల్లో చేరారు. ఏఎంఓగా వేణుగోపాల్, అసిస్టెంట్ సీఎంఓగా చంద్రశేఖర్, అసిస్టెంట్ ఏఎంఓ(కన్నడ)గా నారాయణస్వామి, అలెస్కోగా రామచంద్ర, ఏఎస్ఓగా నరసింహారెడ్డి ఇటీవల ఎంపికయ్యారు. వారికి డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం ఏఎంఓగా వేణుగోపాల్, అసిస్టెంట్ సీఎంఓగా చంద్రశేఖర్, అసిస్టెంట్ ఏఎంఓ(కన్నడ)గా నారాయణస్వామి.. సమగ్రశిక్షన ఏపీసీ శైలజను కలిసి, ఉత్తర్వులు ఇచ్చి జాయిన్ అయ్యారు. అలెస్కో రామచంద్ర ఏపీసీని కలిసి వెళ్లారు. ఏఎస్ఓ నరసింహారెడ్డి జాయిన్ కావాల్సి ఉంది. ఏపీసీ మాట్లాడుతూ.. సెక్టోరల్స్ బాధ్యతగా పనిచేయాలన్నారు. నూతన టీచర్లకు శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆదేశించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు.

కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ల కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

బీకేఎస్ సహకార సొసైటీ చైర్మన్‌పై దాడి

డబ్బు ఇవ్వలేదని కొడవలితో నరికిన మేనల్లుడు



పరామర్శిస్తున్న నాయకులు, ఇన్‌సెట్‌లో గాయపడిన కేశన్న

అనంతపురం క్రైం/బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, బుక్కరాయసముద్రం సహకార సొసైటీ చైర్మన్ చాకలి కేశన్నపై అతడి మేనల్లుడు కొడవలితో దాడిచేసి, తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం జిల్లాకేంద్రంలో జరిగింది. వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం కేశన్న మంగళవారం సాయంత్రం అనంతపురం ఓల్డ్ టౌన్‌లోని మసీదు ఎదురుగా ఉన్న తన ఆఫీస్‌లో ఉండగా అతడి మేనల్లుడు సుబ్బారావు అక్కడికి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న సుబ్బారావు డబ్బులు ఇవ్వాలని కేశన్నను అడిగాడు. ప్రస్తుతం నా వద్ద లేవు అని కేశన్న సమాధానం ఇవ్వడంతో తన వెంట తెచ్చుకున్న కొడవలితో దాడి చేశాడు. దీంతో తల, చేతిపై గాయాలయ్యాయి. స్థానికలు దాడిని అడ్డుకోవడంతో సుబ్బారావు అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన కేశన్నను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతపురం వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు, బుక్కరాయసముద్రం సీఐ పుల్లన్న ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేశన్నకు టీడీపీ నేతల పరామర్శ

దాడిలో గాయపడిన కేశన్నను పలువురు టీడీపీ నాయకులు ఆస్పత్రిలో పరామర్శించారు. వారిలో టీడీపీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా టీడీపీ నేతలు దేగల క్రిష్ణమూర్తి, పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్, ఎస్‌నారాయణ స్వామి, లక్ష్మీనారాయణ, సాకే రామకృష్ణ తదితర టీడీపీ నేతలు పరామర్శించారు. తర్వాత వెంకటశివుడు యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ ఈ దాడి ఘటనతో రాజకీయాలకు సంబంధం లేదన్నారు. నిందితుడైన సుబ్బారావు తరచూ కేశన్నతో తరచూ రూ.2 వేలు, రూ.3 వేలు తీసుకునేవాడన్నారు. డబ్బులు ఇవ్వకపోవడంతోనే దాడి చేసినట్లు తెలుస్తోందన్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. షోలాపూర్-ధర్మవరం ప్రత్యేక రైలు (నం. 01437) ఈనెల 2వ తేదీన షోలాపూర్‌లో రాత్రి 11.20 గంటలకు బయలుదేరి శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు ధర్మవరం చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 01438) ఈనెల 4వ తేదీన ఉదయం 6.30కి ధర్మవరంలో బయలుదేరి ఆదివారం ఉదయం 10.30 గంటలకు షోలాపూర్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు కురుద్వాడి, బర్సి టౌన్, ధారాశివ్, లాతూరు, లాతూరు రోడ్డు, యాద్గిర్, భల్కి, బీదర్, వికారాబాద్, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తాడిపత్రి, పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్డు, ములకలచెరువు, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరం చేరుకుంటుందన్నారు. అలాగే బీదర్-బెంగళూరు కంటోన్మెంటు ప్రత్యేక రైలు (నం. 07063) ఈనెల 4వతేదీ శనివారం మధ్యాహ్నం 2.40 గంటలకు బీదర్‌లో బయలుదేరి ఆదివారం ఉదయం 5.00 గంటలకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07064) ఈనెల 5వ తేదీ రాత్రి 10.30కి బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 2.30కి బీదర్ చేరుతుందన్నారు. ఈ రైలు హోమ్నాబాద్, కమలానగర్, కలబురగి, శంషాబాద్, వాడి, యాద్గిర్, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, యల్హంక స్టేషన్ల మీదుగా బెంగళూరు కంటోన్మెంటుకు చేరుకుంటుందని వివరించారు.

అయ్యో.. పాపం..!

పెళ్లైన నెలకే ప్రమాదం
నవ దంపతుల బైక్‌ను ఢీకొన్న కంటైనర్
భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు

కొత్త జంట.. పెళ్లయి నెల రోజులే అయింది.. ఆ ఇంట ఇంకా సంబరంగానే ఉంది. నవ దంపతులు సంబరంగా గడుపుతున్నారు. బంధువుల ఇంటికి ఆనందంగా బయల్దేరారు. రోడ్డు ప్రమాదం వారి ఆశలను చిదిమేసింది. వరుడిని బలిగొని, వధువు బతుకులో చీకట్లు నింపింది.



నవీన్‌కుమార్ (ఫైల్)



గాయపడిన లలితకుమారి

తనకల్లు, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి సమీపాన మంగళవారం ద్విచక్రవాహనాన్ని కంటైనర్ ఢీకొనడంతో నవ వరుడు నవీన్‌కుమార్ (24) మృతిచెందగా.. వధువు లలితకుమారి తీవ్రంగా గాయపడింది. ఎస్‌ఐ గోపి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంబులపూలకుంట మండలం ఎదురుదొన గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ డ్రైవర్. అతడికి లలితకుమారితో నెలరోజుల క్రితమే వివాహమైంది. కొత్త జంట ఆనందంగా గడుపుతుండేవారు. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలం పెద్దపాల్యంలోని బంధువుల ఇంటికి నవ దంపతులు మంగళవారం బైక్‌లో బయల్దేరారు. చీకటిమానుపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో నవీన్‌కుమార్, లలితకుమారి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వందేమాతరం అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నవీన్‌కుమార్ మృతిచెందాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డాక్టర్ల నిర్లక్ష్యం



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి వైద్యం అందించడంలో వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తనకల్లులోని 30 పడకల ఆస్పత్రి ఎదుట మంగళవారం రాత్రి వందేమాతరం టీమ్, ప్రజలు, బాధిత కుటుంబాలకు చెందిన వారు ధర్నా చేశారు. ఆస్పత్రిలో ఏడుగురు వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన నవీన్‌కుమార్, లలితకుమారి దంపతులను వందేమాతరం టీమ్ అంబులెన్స్‌లో సాయంత్రం 6 గంటలకు ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో ఒక్కరు కూడా విధుల్లో లేరు. కాసేపటికే నవీన్ కుమార్ మరణించాడు. వైద్యసేవలు సకాలంలో అందించకపోవడంతోనే అతడు మరణించాడంటూ వందేమాతరం టీమ్, స్థానికులు, మృతుడి కుటుంబీకులు మండిపడ్డారు. ఆస్పత్రి ముందే ధర్నా నిర్వహించారు. నాలుగు గంటలకు విధులకు హాజరు కావాల్సిన డాక్టర్లు 6.30 గంటలైనా రాకపోవడంతో ధర్నా చేశారు. ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదం చేశారు. ధర్నా విషయం తెలియగానే ఎస్‌ఐ గోపి ఆస్పత్రికి చేరుకుని, ఆందోళనకారులకు నచ్చజెప్పారు. దీంతో వారు ధర్నా విరమించారు.

టమోటా కిలో రూ.17

అనంతపురం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మంగళవారం టమోటాలు కిలో రూ.17తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.9వేలు, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,400 టన్నుల టమోటాలు వచ్చినట్లు తెలిపారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.11వేలు పలికాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం



పాతర్ల శ్రీనివాసులు (ఫైల్)

తనకల్లు, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి సమీపాన మంగళవారం బైక్‌ను బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యవసాయ కూలీ పాతర్ల శ్రీనివాసులు (30) దుర్మరణం చెందాడు. మండలంలోని సింగిరివాండ్లపల్లికి చెందిన శ్రీనివాసులు అవివాహితుడు. అతడి తండ్రి ఇదివరకే మరణించాడు. తల్లితో కలిసి ఉంటూ అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలం పాతకోటకు వ్యవసాయ పనుల కోసం రోజూ వెళ్లి, వస్తుండేవాడు. మంగళవారం కూడా పాతకోటలో వ్యవసాయ పనులు ముగించుకుని, స్వగ్రామానికి బైక్‌లో బయల్దేరాడు. చీకటిమానుపల్లి సమీపాన టమోటా లోడుతో మొలకలచెరువుకు వెళ్తున్న బొలెరా వాహనం ఎదురుగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో అతడి తల్లి దిక్కులేనిదైంది.

అహుడా చైర్మన్ పదవి ఏడాది పొడిగింపు



టీసీ వరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అహుడా(అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ టీసీ వరుణ్‌కు మరో ఏడాది పదవీకాలం పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్‌కుమార్ జీఓ నంబరు 1076 జారీ చేశారు. తనకు మరో ఏడాది పాటు పదవీకాలాన్ని పొడించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాన్, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు అహుడా చైర్మన్ టీసీ వరుణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

లోక కల్యాణార్థం చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పుట్టపర్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని హరిహర దేవాలయంలో మంగళవారం చండీహోమాన్ని ప్రారంభించారు. లోకకల్యాణార్థం హోమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా చేపట్టిన హోమాన్ని దసరా రోజు పూర్ణాహుతితో ముగిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. హోమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన పరిటాల శ్రీరామ్



కలెక్టర్‌తో పరిటాల శ్రీరామ్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మంగళవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్‌ను వారివారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి సహకారం అందించాలని కలెక్టర్, ఎస్పీని కోరారు.

మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన

పుట్టపర్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా వాటిని పునర్విభజన చేసి 27 వార్డులు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు కమిషనర్ క్రాంతికుమార్ మంగళవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు వారం రోజుల్లోగా వార్డుల పునర్విభజనపై సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

4, 5 తేదీల్లో ఉరుసు ఉత్సవం

నంబులపూలకుంట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచెలమల గ్రామంలో ఈనెల 4నుంచి చిన్నకుళ్లాయిస్వామి ఉరుసు మహోత్సవం జరగనున్నట్లు గ్రామస్థులు మంగళవారం తెలిపారు. పేట బావి వద్ద చిన్నకుళ్లాయిస్వామి ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. పానకం దుత్తలు, కీలుగుర్రాలు, చెక్కభజన, గంధం మెరవణి ఉంటాయన్నారు. 5న అగ్నిగుండ ప్రవేశం ఉంటుందన్నారు. మండల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తారని, అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు రైతులతో సమావేశం: ఏఓ

తనకల్లు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయం లో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి భారతి మంగళ వారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ అనుబంధ రంగాల యంత్రాలు ధరలు తగ్గినట్లు తెలిపారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. మండలంలోని రైతులు, రైతు సంఘాల నాయకులు హాజరుకావాలని ఏఓ కోరారు.

యువతకు ఉద్యోగావకాశాలు

కదిరి, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): యువతకు జి ల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి వకాశాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి చంద్రకళ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదివి 19 సంవత్సరాల నుంచి 26 సంవత్సరాల మధ్య వయస్సున్న యువతి, యువకులకు స్కిల్ డైవలప్‌మెంటులో 90రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం, యూనిఫాం అందిస్తూ... కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో అనువజ్ఞులైన అధ్యాపకుల ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ తీసుకున్నవారికి సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబరు 6303131963కు సంప్రదించాలని ఆమె కోరారు.

గొడవలకు దూరంగా ఉండండి

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండి ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలైన కామిరెడ్డిపల్లి, కట్టకిందపల్లిల్లో రాత్రి గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలందరూ ఎటువంటి గొడవలకు పోకుండా అప్యాయంగా జీవించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మద్యానికి బానిస కాకూడదని, పేకాటకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సైబర్‌క్రైమ్, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

బుక్కపట్నం, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూనిపల్లిలో 12మంది రైతుల వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్‌ను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో పంట పొలాలకు నీరెలా అందించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలపరిధిలో వరుసగా జరుగుతున్న వ్యవసాయ కేబులో చోరీలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. వ్యవసాయ పంపుసెంట్లకు ఏర్పాటు చేసిన కేబుల్‌ను రాత్రికి రాత్రే కత్తరించి ఎత్తుకెళుతున్నారు. సోమవారం రాత్రి మండలంలోని గూనిపల్లిలోని 12మంది రైతుల కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. ఈ వరుస దొంగతనాలను అరికట్టాలని రైతులు పోలీసులను కోరుతున్నారు.

ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



డైరెక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న కూటమి నాయకులు

బుక్కపట్నం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పత్తి చంద్రశేఖర్‌ను కూటమి నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనను శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ టౌన్ కన్వీనర్ ఎర్రకేశప్ప, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు సంజీవరాయుడు, జనసేన నాయకులు జయరాం, దాసరి శ్రీనివాసులు, తోట అనిల్, మనర్సుర్, గుడా సోము, జగం వెంకటరాముడు, టీడీపీ యువనాయకులు మంజు, దిలీప్ పాల్గొన్నారు.





ధర్మవరంలో మహాదేవిగా టీచర్స్‌కాలనీలోని చౌడేశ్వరీదేవి, దుర్గాదేవిగా గాంధీనగర్ చౌడేశ్వరి





దుర్గాదేవిగా మామిళ్ళకుంట లలితాంబ, పుట్టపర్తిలో సత్యమ్మ

దుర్గతులను తొలగించే దుర్గాదేవి

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్ వర్క్)

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం భక్తులు పాహిమాం దుర్గాదేవి అంటూ ప్రార్థించారు. ఇందులో భాగంగా మామిళ్ళకుంట లలితాపరమేశ్వరి దుర్గామాతగా, ప్రశాంతినిలయంలోని గాయత్రీమాత, జిల్లా కేంద్రంలోని సత్యమ్మ, వాసవీ కన్యకా పరమేశ్వరి, ఎనుమలపల్లి దుర్గమ్మ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ధర్మవరం పట్టణంలో శ్రీనివాసనగర్ వెంకటేశ్వరస్వామి శ్రీకృష్ణుడిగా, దుర్గాదేవి అలంకరణలో దుర్గమ్మ, చౌడేశ్వరి, పద్మావతి, వాసవీమాత, పుట్లమ్మ, గాయత్రీదేవి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే గోరకాటి పెద్దమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మండలంలోని ఉప్పునేసినపల్లిలో కొల్హాపురమ్మను, గొట్లూరులో మహంకాళమ్మను దుర్గాదేవిగా అలంకరించారు. బత్తలపల్లిలో అమ్మవారు, తాడిమర్రిలో వాసవీ మాత, బుక్కపట్నం చౌడేశ్వరి దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. కదిరి పట్టణంలో కన్యకా పరమేశ్వరి మహిషాసుర మర్దినిగా, చౌడేశ్వరీ దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు.



కదిరిలో మహిషాసుర మర్దినిగా కన్యాకాపరమేశ్వరి



దుర్గాదేవిగా బుక్కపట్నం చౌడేశ్వరి



ఉప్పునేసినపల్లి కొల్హాపురమ్మ

కార్మికుల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి సత్యకుమార్ యాదవ్



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న మంత్రి సత్యకుమార్, చిలకం మధు

ధర్మవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో వైదేహి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో మున్సి పల్ కార్మికుల కోసం మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉచిత వైద్యశిబిరాన్ని మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరంలో మంత్రితోపాటు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... మున్సిపల్‌కార్మికులు తరచూ శారీరక శ్రమతోపాటు ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తా రని, కావున వారిలో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకే ఈ వైద్యశిబిరం ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కింద రాష్ట్రంలో ఇప్పటివరకు 48లక్షల మంది ఉచితంగా పరీక్షలు చేయించుకున్నారన్నారు. అలాగే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఇప్పటికే కోటి నలభై లక్షల కుటుంబాలకు ఉచిత వైద్య సహాయం అందిస్తున్నారన్నారు. దాదాపు రూ.25లక్షల ఖరీదైన చికిత్సలు కూడా ఉచితంగానే అందిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో కార్మికులకు క్యాన్సర్, రక్తపోటు, షుగర్, న్యూరో, ఈఎన్‌టీ వంటి వాటికి పరీక్షలు వైద్యులు నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధే కర్తవ్యం: మంత్రి

ధర్మవరం: నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన కర్తవ్యమని మంత్రి సత్యకు మార్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన మంగళవారం రాత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నియోజకవర్గంలో చేపట్టిన రోడ్లు, వంతెనలు, కాల్వలు, భవనాల నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నాణ్యతతో పనులు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీరు, పారిశుద్యం సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



దర్శినమల పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శినమల గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఆరోగ్యకేంద్రంలో ఉన్న ల్యాబ్ రికార్డులను, సిబ్బంది రిజిస్టర్‌ను పరిశీలించారు. రోజూ ఎంతమందికి ఓపీ సేవలు అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈహెచ్‌ఆర్, ఏబీహెచ్‌ఏ, ఐడీ గురించి, గ్రామాల్లో జ్వర బాధితుల కేసుల వివరాలపై ఆరాతీశారు. రోగుల పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా మెలిగి, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట వైద్యాధికారి వన్నప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రధాని, కేంద్ర వ్యవసాయ మంత్రి చిత్రాపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

తనకల్లు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ధనధాన్య కృషియోజన పథకానికి కేంద్రం జిల్లాను ఎంపిక చేయడం హర్షణీయమని కిసాన్ మోర్చా నాయకులు పేర్కొన్నారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ చిత్రపటాలకు తనకల్లులోని అంబేడ్కర్ సర్కిల్‌లో క్షీరాభిషేకం చేశారు. ధనధాన్యా కృషియోజన పథకానికి దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన వంద జిల్లాలో మన జిల్లా ఉండడం ఇక్కడి ప్రజలకు వరమని కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చింతా శరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబురెడ్డి, సురేంద్ర, సురేష్, గోపి, నరేష్ కుమార్, సోమురాయల్, రమేష్‌నాయక్, శ్రీనివాసులనాయక్, భార్గవ్, వెంకటా చలపతి, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రెండు వర్గాల ఘర్షణ.. పలువురికి గాయాలు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చు రామి గ్రామంలో మంగళవారం రాత్రి రెండు వర్గాలు ఘర్షణ పడి, పరస్పర దాడులకు పాల్పడ్డాయి. రూరల్ పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు క్రిష్టయ్య, నరసింహులుకు, వైసీపీ వర్గానికి చెందిన పెద్దఫక్కీరప్ప, గంటా నరసింహులు భూమికి వెళ్లే దారివిషయంలో గతంలో గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి టీడీపీ వర్గానికి చెందిన నరసింహులు తమను దూషించడనే నేపంతో వైసీపీ వర్గానికి చెందిన గంటా నరసింహులు, పెద్దఫక్కీరప్ప, నందకుమార్ అతడి ఇంటిపైకి దాడికి వెళ్లారు. అక్కడ నరసింహులు లేకపోవడంతో తమ్ముడు క్రిష్టయ్య ఇంటిపై వారు కట్టెలతో దాడికి తెగబడ్డారు. ఈ సందర్భంగా చెలరేగిన ఘర్షణలో ఇరువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. దాడులలో టీడీపీ వర్గీయుడు క్రిష్ణయ్య భార్య నాగమణి, వైసీపీ వర్గానికి చెందిన గంటా నరసింహులు, పెద్ద ఫక్కీరప్ప, నందకుమార్ గాయపడ్డారు. గాయపడిన వారికి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెండువర్గాల బాధితులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

వాగు దాటాల్సిందే..!



రెండు గ్రామాల మధ్యలో ఉన్న వాగు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి)

మండల పరిధిలోని ధర్మపురి గ్రామం నుంచి చిన్నూరుబత్తలపల్లికి వెళ్లాలంటే ఆ గ్రామప్రజలు వాగుదాటాల్సిందే. ఆ రెండు గ్రామాలకు మధ్యలో వాగు ఉంది. సమీప చెరువు చెలిమి నీటితో ఆ వాగు నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. అంతేగాకుండా వర్షాలు కురిస్తే ఆ వాగులో భారీగా నీరు చేరి ఆ రెండు గ్రామాలకు రాకపోక లు నిలిచిపోతాయి. వాగులో సిమెంట్ పైపులు వేసి, రహదారి ఏర్పా టుచేస్తే తప్ప రాకపోకలకు అంతరాయం కలుగకుండా ఉండదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వారు వాపోతు న్నారు. మామూలుగా చిన్నూరుబత్తలపల్లి నుంచి ధర్మపురి మీదుగా ధర్మవరం వెళుతుంటారు. ఆ వాగు పారితే రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందని గ్రామస్థులు తెలుపుతున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి ఊరేగింపు



చౌడేశ్వరీదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ధర్మవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోనికోట రామలింగ చౌడేశ్వరీదేవి ఉత్సవ విగ్రహాన్ని దుర్గాష్టమి సందర్భంగా మంగళవారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా ఊరేగించారు. ముందుగా ఆలయంలో కలశ పూజ చేశారు. ఉదయం 8గంటలకు ఆలయం నుంచి 108 కలశాలతో ఉత్సవ విగ్రహాన్ని దేవాంగం పేట వరకు ఊరేగించి తిరిగి ఆలయానికి చేర్చారు. ఆలయంలో మధ్యాహ్నం 12-30 గంటలకు అన్నప్రసాద వినియోగం చేపట్టారు. దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు: ఆర్డీఓ



తనిఖీలు చేస్తున్న ఆర్డీఓ మహేష్

బత్తలపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జ్వాలాపురం చెక్ పోస్టు వద్ద సోమవారం రాత్రి ఆర్డీఓ మహేష్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టే చర్యలను పరిశీలించారు. అనంతరం సీసీరేవు రీచ్‌కు వెళ్లారు. అక్రమంగా ఇసుక తరలించేందుకు అక్కడ సిద్ధంగా ఉన్న రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు ఆర్డీఓ తెలిపారు. ఎవరైన అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం టూటౌన్ సీఐ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లిలో పారిశుధ్య పనులు

బత్తలపల్లి, సెప్టంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం పంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. బత్తలపల్లిలోని టీచర్స్ కాలనీ, ఎస్సీ కాలనీ, మైనార్టీ కాలనీల్లో నెలకొన్న అపరిశుభ్రతపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం 'కాలువల్లో కదలని మురుగు' అనే శీర్షికతో కథనం వెలువడిని విషయం విదితమే. దీనిపై ఉన్నతాధి కారులు సీరియస్ అయ్యారు. మండలకేంద్రంలో ఇంత అధ్వానంగా ఉంటే మీరు ఏమి చేస్తున్నారని పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో పంచాయతీ కార్యదర్శి ముత్యాల్‌నాయుడు సోమ, మంగళవారాల్లో కార్మికులను తీసుకెళ్లి డ్రైనేజీలను శుభ్రం చేయించారు. మురుగు నీరు నిలువ ఉండకుండా ముందుకు కదిలేలా చేశారు. రాత్రిళ్లు ఫాగింగ్ చేశారు. ఎనిమిది సంవత్సరాల తరువాత ఫాగింగ్ చేయడంతో అయా కాలనీ వాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి స్పందన

పైపులైన్ లీకేజీపై చర్యలు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లిలో తాగునీటి పైపు లీకేజీని అధికారులు మంగళవారం అరికట్టారు. గ్రామంలో పైపు లీకేజీతో తాగునీరంతా వృధాగా పోతుండేది. దీనిపై ఈనెల 29న 'పైపు లీకేజీతో తాగునీటి వృధా' అనే వార్త ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన ఎంపీడీఓ సాయి మనోహర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్ తాగునీటి లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి జ్యోతిని ఆదేశించారు. దీంతో ఆమె టీడీపీ నాయకుడు మల్లేనిపల్లి చంద్రతో మాట్లాడి మంగళవారం తాగునీటి పైపు లీకేజీని అరికట్టారు. కలుషితమైన నీరు రాకుండా పైపు లీకేజీని అరికట్టినందుకు అధికారులకు, ఆంధ్రజ్యోతికి గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

నంబులపూలకుంట, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): స్థానిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలకేంద్రంలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ పంపిణీలో టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ దండే రవిశంకర్, సహాయ కార్యదర్శి నరసింహులు, మగ్గం రామాంజి, మౌలా, దండోరా రెడ్డెప్ప, రామిరెడ్డి, సొసైటీ సీఈఓ బాబాఫక్రుద్దీన్; అకౌంటెంట్ సుమశ్రీ, అటెండర్ శ్రీరాములు పాల్గొన్నారు. వీరు ప్రతి ఇంటికెళ్లి స్మార్ట్‌కార్డులు అందించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు

కదిరి అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల సందర్భంగా ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు పదిరోజుల పాటు నిర్వహించిన ఆటోమోటివ్ ఇంటర్ షిప్ శిక్షణా కార్యక్రమాలు మం గళవారంతో ముగిశాయి. పట్టణంలోని యమహా ద్విచక్రవాహన షోరూంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు వృత్తి విద్యాకోర్సులలో నైపుణ్యాన్ని పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జీసీడీఓ సంపూర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు శైలజ, ఉపాధ్యాయులు దశరథనాయక్, ఒకేషనల్ సిబ్బంది సల్మా, లావణ్య, విజయకుమార్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం పూల మార్కెట్లో కొనుగోలుదారుల సందడి

దుర్గమ్మా.. పాహిమాం..!

కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

హిందూపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులు పురస్కరించుకుని తొమ్మిదవరోజు దుర్గమ్మ చండీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ కంఠపురంలోని సుంకలమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. పసుపు అలంకారంలో దర్శనమిచ్చారు. వాసవీకన్యకాపరమేశ్వరి మహిశాశురమర్ధినిగా, వెన్నకృష్ణుని అలంకారంలో పేట వెంకటరమణస్వామి దర్శనమిచ్చారు. పరిగి మండలంలోని చెరువుకట్ట కింద వెలసిన హొన్నదేవి ఆలయంలో సప్తమాతృతదేవి దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. గోరంట్లలోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెనుకొండలోని చంద్రగిరి గ్రామంలో శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠంలో, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవి గా అమ్మవారిని అలంకరించారు. మడకశిర పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్ధినిగా దర్శనమిచ్చారు. అదేవిధంగా జమ్మానిపల్లిలోని నిడిమామిడమ్మదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమందేపల్లిలోని పాతూరులో చౌడేశ్వరి అమ్మవారు దుర్గమ్మగా దర్శనమిచ్చారు.

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)



సోమందేపల్లి పాతూరులో దుర్గాదేవిగా చౌడేశ్వరీమాత



పరిగిలో దుర్గాదేవిగా దర్శనమిస్తున్న సప్తమాతృక దేవి



మడకశిరలో మహిషాసురమర్దినిగా వడిసలమ్మ



గోరంట్లలోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ



హిందూపురంలో విశేష అలంకరణలో యల్లమ్మదేవి



వెన్నకృష్ణ అలంకారంలో పేట వెంకటరమణస్వామి



మహిషాసురమర్దినిగా వాసవీమాత



సుంకులమ్మకు పసుపుతో అలంకరణ

మంత్రిని కలిసిన కలెక్టర్, ఎస్పీ



మంత్రితో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మంత్రి సవితను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కలిసి జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై చర్చించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి ఏడుగురు..

పెనుకొండ టౌన్, (ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండలం చాలకూరు గ్రామానికి చెందిన ఏడుగురు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి సవిత కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎం. సోమశేఖర్, డీ. సోమశేఖర్, రవన్న, వెంకటేశ్, నాగరాజు, అశ్వర్థప్ప ఉన్నారు. ఈ కార్యక్రమంలో నీరుగంటి చంద్ర, భాను కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించాలి

మంత్రికి నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

పెనుకొండ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ధన్వంతరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రి సవితను కోరారు. మంగళవారం మంత్రి కార్యాలయంలో కలిసిన నాయకులు వినతిపత్రం అందిస్తూ ధన్వంతరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే విధంగా చొరవచూపాలన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో మాట్లాడి ప్రభుత్వం నుంచి జీవో వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు వెంకటరంగయ్య, కార్యదర్శి శివశంకర్, సలహాదారుడు శివప్రసాద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, నాగరాజు, విజయనగరం నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్టీసీ శ్రీనివాసులు, అనంతపురం రూరల్ ఎంపీడీఓ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కనకదాస విగ్రహ ఆవిష్కరణ ఈనెల 5న తిరుపతిలో జగరనుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సవిత కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్లను మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు, సర్పంచ్ మంజునాథ్, పరిగి బేబి తదితరులు పాల్గొన్నారు.

నేడు చెరుకూరుకు మంత్రి

రొద్దం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చెరుకూరు గ్రామంలో పింఛన్ల పంపిణీకి మంత్రి సవిత వస్తున్నట్లు కన్వీనర్ నరహరి ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

క్రికెట్ టోర్నీ విజేత పావగడ జట్టు



పావగడ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్ఐ ఇషాక్ బాషా తదితరులు

అమరాపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ విజేతగా పావగడ జట్టు నిలిచింది. 20 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో మంగళవారం ఫైనల్స్ జరిగాయి. ఈ పోటీలో అమరాపురం, పావగడ జట్లు తలపడ్డాయి. పది ఓవర్లలో పావగడ జట్టు 112 పరుగులు చేయగా అమరాపురం జట్టు కేవలం 90 పరుగులు చేసింది. దీంతో పావగడ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్స్‌గా నిలిచిన పావగడ జట్టుకు రూ. 20 వేలు, ట్రోఫీ, రన్నర్స్ జట్టుకు రూ. 15 వేలు, షీల్డ్‌ను ఎస్ఐ ఇషాక్‌బాషా, గిరీష్ జోగేంద్ర, కేఎన్ఎం శివకుమార్, బాలాజీ అందించారు. కార్యక్రమంలో యువరాజు, అనీల్, గిరీష్, కొప్పారం రాజు, వాదిరాజు, గోల్డ్‌షాపు నాగరాజు, హనుమంతరాయుడు పాల్గొన్నారు.

బురదమయంగా బీసీ కాలనీ

రొద్దం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శేషాపురం గ్రామంలోని బీసీ కాలనీ డ్రైనేజీలు, సీసీ రోడ్లులేక బురదమయంగా తయారైంది. ప్రతిరోజూ రోడ్డుపైనే మురుగునీరు పారుతున్నా అందులోనే తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు కొన్నిచోట్ల బురదగుంటలుగా ఏర్పడటంతో దుర్గంధం వెదజల్లుతూ దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, పంచాయతీ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని డ్రైనేజీలు, సీసీరోడ్లు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.



కాలువ లేకపోవడంతో రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు

దుర్గాష్టమి వేడుకల్లో మాజీ ఎంపీ నిమ్మల



వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ నిమ్మల

గోరంట్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దుర్గాష్టమి వేడుకలను గోరంట్లలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవాంగుల సంఘం ఆధ్వర్యంలో చిత్రావతి నది నుంచి చౌడేశ్వరీదేవిని ఊరేగించారు. మాజీ ఎంపీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల కిష్టప్ప, వరలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని నిమ్మల కిష్టప్ప ప్రారంభించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్



మాట్లాడుతున్న జీఎం శేఖర్

రొద్దం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం రొద్దం మండల బీజేపీ నాయకులు పుట్టపర్తిలోని పార్టీకార్యాలయంలో అధ్యక్షుడితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. ప్రతి ఒక్కరినీ కలుపుకుని ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కారదిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో రొద్దం మండల బీజేపీ నాయకులు వేణుగోపాల్, అరుణ్ చౌదరి, రవి, లింగమయ్య, శ్రీనివాసులు, మహదేవ్, నారాయణరెడ్డి, మోహన్, రాజు, చిక్కప్ప, ప్రకాశ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రంగనాథ్ (ఫైల్)

అగళి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమరణపల్లి రోడ్డులో బొలేరో ద్విచక్రవాహనం ఢీకొని రొళ్ల మండలం రంగన్నపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్(26) మంగళవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రొళ్ల మండలం రంగనపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్ ద్విచక్రవాహనంలో అగళి నుంచి రొళ్ల మండలం రంగన్నపల్లికి వెళ్తుండగా బొలెరో అతివేగంగా రత్నగిరి నుంచి అగళివైపు వస్తూ జంగరమరణపల్లి రోడ్డు సమీపంలో ఢీకొంది. దీంతో రంగనాథ్ అక్కడికక్కడే మృతిచెందాడు. బొలెరో కంపచెట్లలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతుడి తండ్రి మేలగిరియప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అగళి పోలీసులు తెలిపారు.

విద్యతోనే అభివృద్ధి అని నమ్మిన వ్యక్తి చంద్రబాబు

ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిర టౌన్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): విద్య ఎక్కడ ఉంటే అక్కడ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని అని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన 35 మందిని సన్మానించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమలతిప్పేస్వామితో కలసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదరికం దూరం కావాలన్నా, అందరూ సమానంగా అభివృద్ధి చెందాలన్న ఒక్క విద్యతోనే సాధ్యమన్నారు. భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, గ్రామీణ విద్యార్థులకు గుణాత్మక, నాణ్యమైన విద్య అందించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు మాట్లాడుతూ అత్యధిక ఉపాధ్యాయ పోస్టులను ముఖ్యమంత్రి చంద్రబాబు భర్తీ చేశారని, ఆయన వల్లే తాము నేడు ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

15వేల ఇళ్ల పట్టాలిస్తాం: ఎమ్మెల్యే

మడకశిర టౌన్/అమరాపురం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మడకశిర నియోజకవర్గంలో ఒక్కరోజే 15వేల ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి మాట్లాడుతూ అక్టోబరు 15న నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు అందజేశాస్తామన్నారు. అక్టోబరు 10న వంద ఎస్సీ కాలనీలకు శ్మశాన వాటిక స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. ఆరోజు అమరాపురంలో అంబేడ్కర్ స్మృతివనం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపి, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జలహారతి నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో రూ.14కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. పార్టీని మరింత బలపర్చేందుకు ఎస్సీ, ఎస్టీలు కంకణం కట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, వక్కలిగా కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, నగర పంచాయతీ ఛైర్మన్ నరసింహరాజు, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కన్వీనర్ నాగరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రొళ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మల్లసముద్రం గ్రామానికి చెందిన అశోక్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సాయంగా రూ.20వేలు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

జనసేన నాయకులు..

గోరంట్ల: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీకి చెందిన శ్రీరాములు అనారోగ్యంతో శస్త్రచికిత్స చేసుకోగా జనసేన పార్టీ నాయకులు మంగళవారం రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. మండల కన్వీనర్ సంతోష్, జిల్లా కార్యదర్శి సురేష్, వెంకటేష్, అనిల్‌కుమార్‌యాదవ్, నరేష్, నగేష్ తదితరులు ఆర్థికసాయం అందించారు.

ప్రైవేటీకరణ ఆపాలి: వైసీపీ

హిందూపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ ఆపాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మడకశిర వైసీపీ ఇన్‌చార్జి ఈరలక్కప్ప, వైసీపీ నాయకులు వేణురెడ్డి మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపి ప్రభుత్వ అధీనంలో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నరసింహులు, నరసింహమూర్తి, మోహన్, ఫారూక్, కుమార్, మలుగూరు శివన్న, శ్రీరాములు, నవీన్, అయూబ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

పరిగి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్థానిక టీడీపీ నాయకుడు వడ్డె హనుమయ్య ఆధ్వర్యంలో సవిత యూత్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల నేపథ్యంలో టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా 15 జట్లు పాల్గొంటున్నాయని, విజేత జట్టుకు రూ.15 వేలు, రన్నర్‌కు రూ.7,500 ట్రోఫీలు అందజేయనున్నామన్నారు. కార్యక్రమంలో ధనాపురం రమేష్, జనసేన అధ్యక్షుడు సురేష్, స్కూల్ కమిటీ ఛైర్మన్ అశ్వత్థ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో పతకాలు



విజేతలుగా నిలిచిన జిల్లా విద్యార్థులు

హిందూపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం కొప్పల్ పట్టణంలో జరిగిన 13వ జాతీయస్థాయి పెంకాక్‌సిలాట్ పోటీల్లో హిందూపురానికి చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచినట్లు రాష్ట్ర పెంకాక్‌సిలాట్ సీఈఓ డాక్టర్ పురిమిట్ల మనోజ్‌సాయి తెలిపారు. 13వ జాతీయస్థాయి సింగ, మకాన్, ప్రీటీన్, ప్రీ జూనియర్ పెంకాక్ సిలాట్ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు పాల్గొన్నారని, హిందూపురానికి చెందిన తనీశ్వర్‌రెడ్డి బంగారపతకం, మదీహాబాను సిల్వర్, అఫీఫా కౌసర్ బ్రాంజ్‌మెడల్ సాధించారన్నారు. వీరిని పెంకాక్‌సిలాట్ అసోసియేషన్ కార్యదర్శి భరద్వాజ్, కోశాధికారి జనార్దన్‌రెడ్డి, రఫీక్‌అహ్మద్, ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

ఫైనల్లో సోమందేపల్లి, మడకశిర జట్లు

మడకశిర టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న లెదర్‌బాల్ క్రికెట్ టోర్నీలో సోమందేపల్లి, మడకశిర జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మంగళవారం పోటాపోటీగా టోర్నీ సాగింది. అనంతపురం ఏడీసీఏ, హిందూపురం హెచ్‌సీఏ జట్లు తలపడ్డాయి. అనంతపురం జట్టు 20 ఓవర్లలో 173 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిందూపురం హెచ్‌సీఏ జట్టు 19.1 ఓవర్లలోనే 179 పరుగులు చేసి విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో హిందూపురం హెచ్‌సీఏ, సోమందేపల్లి జట్లు పోటీపడ్డాయి. హిందూపురం జట్టు మొదట బ్యాటింగ్ దిగి 18.1ఓవర్లలో 113 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సోమందేపల్లి జట్టు 19 ఓవర్లలో 116 పరుగులు చేసి విజయం సాధించింది. ఫైనాల్‌కు సోమందేపల్లి, మడకశిర జట్లు చేరాయి. అభిమన్యు స్పోర్ట్స్ సభ్యులు నాగేంద్ర, వేణు, కొల్లేష్ పోటీలను పర్యవేక్షించారు.